ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు

పెద్దవూర: మండల పరిధిలోని పలు గ్రామ పంచాయతీలలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కంచెలు నిర్మించకపోవడంతో ప్రమాదకరంగా మారాయి. ఆయా గ్రామాలకు, వ్యవసాయ బోరుబావులకు విద్యుత్ సరఫరా అందించే ట్రాన్స్‌ఫార్మర్‌లను రహదారుల వెంట ఏర్పాటు చేశారు. కానీ వాటి చుట్టూ విద్యుత్ శాఖ అధికారులు ఎలాంటి రక్షణ కంచెలు ఏర్పాటు చేయలేదు. దీంతో వర్షాలు కురిసినప్పుడు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఎర్తింగ్ వస్తుండడంతో వాటి సమీపంలోకి వెళ్లిన పశువులు విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడుతున్నాయి. ఇంత జరుగుతున్నా విద్యుత్ అధికారులు పట్టించుకోకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. చిన్నపిల్లలు ఆడుకుంటూ ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు వెళ్లి విద్యుదాఘాతానికి గురై మృతి చెందుతున్నారని, అధికారులు వెంటనే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రక్షణకు కంచెలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


పిన్నవూరలో రక్షణ కంచెలు లేకుండా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు


పెద్దగూడెంలో రోడ్డు వెంట..


తెప్పలమడుగులో..


బట్టుగూడెంలో..

ప్రజల పక్షాన పోరాటం చేస్తాం

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్

దేవరకొండ: ప్రాణం ఉన్నంత వరకు ప్రజల పక్షాన పోరాడుతానని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. మంగళవారం దేవరకొండ పట్టణంలోని సాయిరమ్య ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ దేవరకొండ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల కోసం రాజకీయాల్లోకి వచ్చానని, వారిని కాపాడుకోవడంలో ముందుంటానని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ గెలిపించేందుకు కృషి చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజల నిర్ణయాన్ని గౌరవించాలని అన్నారు. పార్టీ శ్రేణులకు నిరంతరం అందుబాటులో ఉంటానని, ఎవరూ అధైర్యపడొద్దని సూచించారు. సమావేశంలో నాయకులు కేతావత్ బీల్యానాయక్, వడ్త్య రమేష్‌నాయక్, నేనావత్ కిషన్‌నాయక్, హన్మంతు వెంకటేష్‌గౌడ్, కంకణాల వెంకట్‌రెడ్డి, వంగాల ప్రతాప్‌రెడ్డి, మారుపాకల సురేష్‌గౌడ్, కేతావత్ బాలు, టీవీఎస్ రెడ్డి, ముత్యాల సర్వయ్య, లోకసాని తిరుపతయ్య తదితరులున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రవీంద్రకుమార్

ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలి

మిర్యాలగూడ టౌన్: ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపాలని మిర్యాలగూడ ఎంపీపీ నూకల సరళాహనుమంతరెడ్డి అన్నారు. మంగళవారం మిర్యాలగూడ మండలం జప్తివీరప్పగూడెం గ్రామంలో గల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అల్లం అనంతరెడ్డి తన ఖర్చులతో కొనుగోలు చేసిన క్రీడా సామగ్రిని ఎంపీపీ 40మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందన్నారు. ప్రస్తుతం కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని, ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తన సొంతంగా రూ.15వేలతో విద్యార్థులకు క్రీడా సామగ్రిని అందించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు క్రీడల్లోనూ రాణించి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ బాలాజీనాయక్, మాజీ ఎంపీపీ పేలపోలు తిరుపతమ్మ, ప్రధానోపాధ్యాయుడు అల్లం అనంతరెడ్డి, శ్రవణ్, ఆడోతు వెంకన్న, వెంకటేశ్వర్లు, యాదగిరి తదితరులున్నారు.


విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేస్తున్న ఎంపీపీ సరళ

క్లుప్తంగా

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం


మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న పగడాల సైదులు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండల కేంద్రానికి చెందిన ఆడెపు మేఘన అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నాయకుడు పగడాల సైదులు మేఘన భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దహన సంస్కారాల నిమిత్తం మృతురాలి కుటుంబ సభ్యులు రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట గ్రామస్తులు ఉన్నారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి

త్రిపురారం: మిచాంగ్ తుపాన్ కారణంగా రానున్న మూడు రోజులు తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారని, రైతులు పంటల సాగులో ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని కంపాసాగర్ కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే కోసిన వరి పంటను ఏత్తైన ప్రదేశాలకు తరలించి కుప్పలుగా వేయాలని సూచించారు. ఒక్క ఎకరం కుప్పకు 40కిలోల కల్లుప్పును మొద్దళ్ల మధ్యలో వేసి టార్పాలిన్ పట్టాలను కప్పుకోవాలని అన్నారు. వర్షాలు తగ్గే వరకు ధాన్యాన్ని మార్కెట్ యార్డులకు తరలించడం వాయిదా వేసుకోవాలని సూచించారు. గింజలు మొలకెత్తకుండా ఉండేందుకు 50 గ్రాముల ఉప్పును ఒక లీటరు నీటికి కలిపి తడిచిన కంకులపై పిచికారీ చేసుకోవాలని అన్నారు.

మాలధారులకు అన్నదానం


బట్టుగూడెంలో మాలధారులకు అన్నదానం చేస్తున్న లింగారెడ్డి దంపతులు

పెద్దవూర: మండల పరిధిలోని బట్టుగూడెం గ్రామ పంచాయతీలో గల ఇష్టకామేశ్వరీ దేవాలయంలో మంగళవారం గ్రామానికి చెందిన గాలి లింగారెడ్డి–పవిత్ర దంపతులు అయ్యప్ప, ఆంజనేయ, శివ మాలధారులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు అయ్యప్ప దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వాములకు దక్షిణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు కూన్‌రెడ్డి విజయ్‌రెడ్డి, కాసర్ల శంకర్, సత్యనారాయణరెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, సత్యనారాయణ, శంకర్, కొండల్, ప్రశాంత్, సతీష్‌రెడ్డి, పెరుమాళ్ల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు


రేవంత్‌రెడ్డిని సన్మానించిన డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ తదితరులు

మిర్యాలగూడ అర్బన్: తెలంగాణ నూతన సీఎం రేవంత్‌రెడ్డిని మంగళవారం డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ నేతలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కేసీ వేణుగోపాల్ సీఎంగా రేవంత్‌రెడ్డి పేరును ఖరారు చేసిన వెంటనే వారు ఆయనకు శాలువాలు కప్పి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నల్లగొండ జిల్లాలో కష్టపడి అన్ని స్థానాలు కైవసం చేసుకున్నందుకు శంకర్‌నాయక్‌తో పాటు నాయకులను సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. సీఎంను కలిసిన వారిలో గుండు నరేందర్‌గౌడ్, వేణుగోపాల్‌రెడ్డి, శంకర్‌రెడ్డి తదితరులున్నారు.

కోమటిరెడ్డికి ఉన్నత పదవి ఇవ్వాలి

నల్లగొండ: కాంగ్రెస్ ప్రభుత్వంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ఉన్నత పదవి రావాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, ఏబీసీఎఫ్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ రేకల భద్రాద్రి ఆశాభావం వ్యక్తం చేశారు. మంగళవారం నల్లగొండలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నల్లగొండ ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గతంలో నల్లగొండ నుంచి పోటీచేసిన ఎన్టీఆర్‌ను మించి కోమటిరెడ్డికి మెజార్టీ వచ్చిందని పేర్కొన్నారు. నల్లగొండ నియోజకవర్గ చరిత్రలోనే ఇంత మెజార్టీ ఇంతవరకు ఎవరికీ రాలేదన్నారు. కోమటిరెడ్డి గెలుపులో క్రిస్టియన్ మైనార్టీల పాత్ర కూడా ఉందన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో మైనార్టీలకు ప్రకటించిన పథకాలను అమలు చేయాలని కోరారు. మైనార్టీ కార్పొరేషన్‌లో క్రిస్టియన్ మైనార్టీలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు.

అకాల వర్షాలతో ఆందోళనలో రైతులు

మునుగోడు: తుపానుతో మండలంలోని రైతులు ఆందోళన చెందుతున్నారు. వానాకాలం సీజన్‌లో వరి సాగు చేసిన రైతులు తమ ధాన్యం అమ్ముకునేందుకు ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రాశులుగా పోసుకున్నారు. మునుగోడు మండలంలో మొత్తం 11 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయగా అందులో 8 కేంద్రాల్లోని ధాన్యాన్ని అధికారులు పూర్తిగా కొనుగోలు చేశారు. కొరటికల్, ఊకొండి, సింగారం గ్రామాల్లోని కేంద్రాల్లో ఇంకా 20మంది రైతుల ధాన్యం కొనుగోలు చేయలేదు. దీంతో తమ ధాన్యం వర్షానికి తడిసిపోతుందని వాపోతున్నారు. వీరితోపాటు కొందరు రైతులు పత్తి పంటకు నీరు పారించడంతో నేటికీ దిగుబడి వస్తోంది. మండల వ్యాప్తంగా దాదాపు 15 వేల ఎకరాల్లో పత్తిని కూలీలతో ఏరించకుండా ఉండడంతో ముసురుకు తడిసిపోతోంది. తుపాన్ కారణంగా నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

సోనియా రుణం తీర్చుకున్న ప్రజలు

కేతేపల్లి: తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ రుణాన్ని రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించి తీర్చుకున్నారని టీపీసీసీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యూసుఫ్ జానీ అన్నారు. మంగళవారం ఆయన కేతేపల్లిలో విలేకరులతో మాట్లాడారు. వంద రోజుల్లోనే కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందన్నారు. నకిరేకల్‌లో వేముల వీరేశం గెలుపునకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

జయవీర్‌కు తండ్రిని మించిన మెజార్టీ

- నాగార్జునసాగర్ నియోజకవర్గంలో 55,849 ఓట్ల ఆధిక్యంతో గెలుపు
- ఈ అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఇప్పటివరకు ఇదే రికార్డు



హాలియా: నాగార్జునసాగర్ నియోజకవర్గంలో తొలి ప్రయత్నంలోనే ఎమ్మెల్యేగా కుందూరు జయవీర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందారు. రికార్డు స్థాయిలో 55,849 ఓట్ల మెజార్టీ సాధించి రికార్డు సృష్టించారు. పాత చలకుర్తి నియోజకవర్గంతో పాటు 2009లో ఏర్పాటైన నాగార్జునసాగర్ నియోజకవర్గానికి కలిపి 1962 నుంచి 2023 వరకు 15సార్లు ఎన్నికలు జరిగాయి. 1962లో చలకుర్తి నియోజకవర్గం నుంచి పల్లా పర్వతరెడ్డి గెలుపొందగా 1967, 1972, 1978 ఎన్నికల్లో వరుసగా మూడు పర్యాయాలు నిమ్మల రాములు, 1983, 1985, 1989, 1999, 2004, 2014 కుందూరు జానారెడ్డి, 1994లో గుండెబోయిన రామ్మూర్తి, 2018లో నోముల నర్సింహయ్య, 2021లో జరిగిన ఉప ఎన్నికల్లో నోముల భగత్ విజయం సాధించారు. గతంలో 14 సార్లు జరిగిన ఎన్నికల్లో ఎవరికీ కూడా మెజార్టీ 30వేలు దాటలేదు. 2004 ఎన్నికల్లో కుందూరు జానారెడ్డి తన సమీప ప్రత్యర్థి గుండెబోయిన రామ్మూర్తియాదవ్‌పై 28,772 మెజార్టీ సాధించారు. 2023లో జరిగిన ఎన్నికల్లో తొలిసారిగా పోటీ చేసిన జానారెడ్డి కుమారుడు జయవీర్‌రెడ్డి తన సమీప ప్రత్యర్థి అయిన బీఆర్‌ఎస్ అభ్యర్థి నోముల భగత్‌పై 55,849 ఓట్ల మెజార్టీ సాధించి తండ్రి పేరిట ఉన్న రికార్డును అధిగమించారు. ఇప్పటివరకు జయవీర్‌రెడ్డి సాధించిన మెజార్టీయే సాగర్ నియోజకవర్గంలో అత్యధికం కావడం విశేషం.

గుర్రంపోడు మండలంలో జయవీర్‌రెడ్డికే ఆధిక్యం

గుర్రంపోడు: మండలంలో కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు జయవీర్‌రెడ్డికి 8,211 ఓట్ల మెజార్టీ వచ్చింది. నడికూడలో 540ఓట్లు, బొల్లారంలో 234, కొత్తలాపురంలో 28, ఆములూరులో 127, గుర్రంపోడులో 992, చామలేడులో 237, పిట్టలగూడెంలో 442, వట్టికోడులో 212, పోచంపల్లిలో 412, తేనపల్లిలో 421, తేనపల్లి తండాలో 136, ఉట్లపల్లిలో 200, సుల్తాన్‌పురంలో 104, వెంకటాపురం(ఎస్)లో 43, శాఖాజీపురంలో 65, పాశంవారిగూడెంలో 108, కాల్వపల్లిలో 237, పాల్వాయిలో 188, మెండికానిగూడెంలో 117, మక్కపల్లిలో 126, మైలాపురంలో 223, జూనూతులలో 221, ఘాశీరాంతండాలో 340, కాచారంలో 63, తానేదార్‌పల్లిలో 239, చేపూరులో 471, బ్రహ్మణగూడెంలో 98, తెరాటిగూడెంలో 108, పల్లిపాడులో 28, మొసంగిలో 365, కొప్పోలులో 1001, ఆరెగూడెంలో 146 ఓట్ల మెజార్టీ వచ్చింది. బీఆర్‌ఎస్ కేవలం ఐదు గ్రామాల్లో మాత్రమే మెజార్టీ సాధించింది. ముల్కలపల్లిలో 14 ఓట్లు, పార్లపల్లిలో 26 ఓట్లు, జిన్నాయిచింతలో 90 ఓట్లు, వెంకటాపురం(క)లో 13 ఓట్లు, లక్ష్మీదేవిగూడెంలో 6 ఓట్ల మెజార్టీ బీఆర్‌ఎస్ పార్టీ సాధించింది.

ఎడతెరిపిలేని వర్షంతో రైతులు బెంబేలు


నేలవాలిన వరి చేను

నాగార్జునసాగర్: కృష్ణపట్టిలో సోమవారం మధ్యాహ్నం నుంచి ఎడతెరిపి లేకుండా ఈదురుగాలులతో కూడిన వర్షం కురుస్తుండటంతో వరి చేలు నేలకు వాలాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండంతో మిచాంగ్ తుపాన్ ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల వద్ద తీరం దాటింది. దీంతో తెలంగాణలోని కృష్ణా తీరం వెంట గల తండాలు, గ్రామాలలో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. వానాకాలం సీజన్‌లో వర్షాలు సకాలంలో కురవకపోవడంతో కొంతమంది రైతులు వరినాట్లు చాలా ఆలస్యంగా వేశారు. ఆ చేలను ఇంకా కోయలేదు. కోసిన చేలలోని వడ్లు కల్లాల్లోనే ఉన్నాయి. ఇప్పుడు కురుస్తున్న అకాల వర్షాలతో వడ్లు తడుస్తున్నాయని రైతులు వాపోతున్నారు. పశుగ్రాసం కోసం కట్టలు కట్టించిన గడ్డి కూడా వర్షానికి తడిచి ఆగమైతుందని బాధపడుతున్నారు.

పాఠశాలలకు హాజరుకాని విద్యార్థులు

ఈదురుగాలులతో కూడిన వర్షం కురుస్తుండటంతో చాలా పాఠశాలలకు విద్యార్థులు హాజరు కాలేదు. కృష్ణా తీరం వెంట చాలా చోట్ల పాఠశాలల భవనాలు పాతవి కావడంతో తల్లిదండ్రులు భయంతో తమ పిల్లలను పాఠశాలలకు పంపలేదని ఉపాధ్యాయులు తెలిపారు.

నందికొండలో మత్స్యకారులు గజగజ

నందికొండలోని మత్స్యకారులు నాగార్జునసాగర్‌లో చేపల వేటకు వెళ్లారు. చల్లటి గాలులతో కూడిన వర్షం కురుస్తుండటంతో చలికి గజగజ వణుకుతూ వేటకు వెళ్లారు. రెక్కాడితేనే కాని డొక్కాడని మత్స్యకారులు జలాశయంలోకి చేపల వేటకు వెళ్లక తప్పటం లేదని తెలిపారు.

ఘనంగా అనఘాష్టమి వ్రతాలు

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడలోని రైల్వే కాలనీలో గల శ్రీసాయిదత్త ఆశ్రమంలో మంగళవారం శ్రీఅనఘాష్టమి వ్రతాలు ఘనంగా నిర్వహించారు. గురుస్వామి జానకిరాముడు పర్యవేక్షణలో ఆలయ అధ్యక్షుడు గుండా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నరేందర్ జ్యోతి వెలిగించి వ్రతాలు ప్రారంభించారు. మహిళలు భారీగా పాల్గొన్నారు. కార్యక్రమంలో మట్టయ్య, సోమన్న, అంజిబాబు, శ్రీనివాస్ బాబు తదితరులు పాల్గొన్నారు.


అనఘాష్టమి వ్రతాలలో పాల్గొన్న భక్తులు

బీఆర్‌ఎస్ కార్యకర్తలు మనోధైర్యం కోల్పోవద్దు

- జిల్లా ఎంపీపీల ఫోరం అధ్యక్షుడు మంచికంటి వెంకటేశ్వర్లు


మాట్లాడుతున్న మంచికంటి వెంకటేశ్వర్లు

గుర్రంపోడు: శాసనసభ ఎన్నికల్లో ఓడినంత మాత్రాన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మనోధైర్యం కోల్పోవద్దని జిల్లా ఎంపీపీల ఫోరం అధ్యక్షుడు మంచికంటి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం గుర్రంపోడులో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని అన్నారు. బీఆర్‌ఎస్‌కు ఓటు వేసిన ప్రజలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ ఐదేళ్లు అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గజ్జెల చెన్నారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి రామగిరి చంద్రశేఖర్‌రావు, మండల ఉపాధ్యక్షుడు వెలుగు రవి, వడిత్య నాగరాజు, తరి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

వెంకట నరసింహారెడ్డి జీవితం ఆదర్శనీయం

- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్


వెంకట నరసింహారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

మిర్యాలగూడ అర్బన్: ప్రజా సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించిన మల్లు వెంకట నరసింహారెడ్డి(వీఎన్) జీవితం ఆదర్శనీయమని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ అన్నారు. మంగళవారం మిర్యాలగూడ పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన మల్లు వెంకట నరసింహారెడ్డి 19వ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వీఎన్ చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు జగదీష్‌చంద్ర, మల్లు గౌతంరెడ్డి, మంగారెడ్డి, రామ్మూర్తి, వాడపల్లి రమేష్, మల్లయ్య, సత్యనారాయణరావు, రామారావు, కరీం, శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయానికి తాళం తీసేదెప్పుడు !


తాళం వేసి ఉన్న ఏమిరెడ్డిగూడెం పంచాయతీ కార్యాలయం

కనగల్: నిత్యం గ్రామ పంచాయతీ కార్యాలయంలో అందుబాటులో ఉండి ప్రజల అవసరాలు తీర్చాల్సిన పంచాయతీ కార్యదర్శి విధులకు సక్రమంగా రాకపోవడంతో గ్రామస్తుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనగల్ మండల పరిధిలోని ఏమిరెడ్డిగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయం నెలలో కనీసం సగం రోజులకు పైగా తాళం వేసి ఉంటోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఏదైనా పనికోసం గ్రామ పంచాయతీ కార్యాలయానికి వెళ్తే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని అసహనం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి రెగ్యులర్‌గా రాకపోతే త్వరలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇదే విషయమై ఎంపీడీఓను వివరణ కోరగా.. సంబంధిత పంచాయతీ కార్యదర్శి సక్రమంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో అందుబాటులో ఉండేలా చూస్తామని వివరించారు.

కార్యదర్శి అందుబాటులో ఉండడం లేదు



పంచాయతీ కార్యదర్శి గ్రామంలో అందుబాటులో ఉండడం లేదు. నెలలో సగం రోజులు కూడా కార్యదర్శి గ్రామానికి రావడం లేదు. పంచాయతీ భవనం ఎప్పుడు చూసినా తాళం వేసే ఉంటుంది. కార్యదర్శి రెగ్యులర్‌గా రాకపోతే గ్రామంలో ఉన్న వారందరం సంతకాలు పెట్టి త్వరలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం.

– ఏమిరెడ్డి భూపాల్‌రెడ్డి, ఏమిరెడ్డిగూడెం

నిబంధనలకు విరుద్ధంగా వైన్స్ ఏర్పాటు

చండూరు: మున్సిపాలిటీకి చెందిన మడిగెలో ఓ మద్యం వ్యాపారి నిబంధనలకు విరుద్ధంగా మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేశాడు. ప్రభుత్వం రెండు నెలల క్రితం నిర్వహించిన మద్యం టెండర్లలో ఓ మద్యం దుకాణాన్ని చండూరులోని కొందరు వ్యాపారులు దక్కించుకున్నారు. ఆ దుకాణాన్ని మంగళవారం మున్సిపాలిటీ మడిగెలో ప్రారంభించారు. అనుమతులు లేకుండా దుకాణాన్ని మున్సిపల్ మడిగెలో ఎలా ఏర్పాటు చేశారని ఓ కౌన్సిలర్.. ఎక్సైజ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో మున్సిపల్ కమిషనర్ మడిగెను ఖాళీ చేయాలని మద్యం వ్యాపారులకు ఆదేశాలిచ్చారు.

గతంలో అనుమతులు..

చండూరు మున్సిపాలిటీలో రోడ్డు వెడల్పులో భాగంగా ఓ వైన్ షాపును ఖాళీ చేయాల్సి వచ్చింది. దీంతో ఆ వైన్ షాప్ యాజమానులు తాత్కాలికంగా 11, 12, 21 మున్సిపల్ మడిగెలు అద్దెకు కావాలని దరఖాస్తు చేసుకున్నారు. మున్సిపాలిటీ పాలకవర్గం తీర్మానం చేసి అనుమతుల కోసం కలెక్టర్‌కు సిఫారసు చేశారు. కలెక్టర్ అనుమతుల అనంతరం మున్సిపల్ అధికారులు ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ వరకు ఒక్కో మడిగెకు రూ.6700 చొప్పున మొత్తంగా రూ.20,100 నిర్ధారించి 12.09.2023 న ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం ఆ నాలుగు నెలలు మున్సిపల్ మడిగెల్లో వైన్ షాపు నిర్వహించారు.

పాత కమిషనర్ సంతకంతో లెటర్

నూతనంగా కేటాయించిన వైన్ షాపునకు మడిగెలు అందుబాటులో లేక మున్సిపల్ మడిగెల్లో నిర్వహిస్తున్నట్లు గతంలో ఇక్కడ పనిచేసిన కమిషనర్ సంతకంతో కూడిన లెటర్‌ను ఎక్సైజ్ అధికారులకు మద్యం వ్యాపారులు అందించారు. నమ్మిన అధికారులు తాత్కాలికంగా అనుమతులు జారీ చేశారు.

ఆ లెటర్ ఎక్కడిది..

నూతన షాపు ఏర్పాటుకు ఎక్సైజ్ అధికారులకు అందజేసిన లెటర్ ఎక్కడిది, ఎవరు ఇచ్చారనే దానిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఇచ్చిన లెటర్‌లో ఉత్తర్వుల నంబర్‌తో పాటుగా పాలకవర్గం తీర్మానం చేసి కలెక్టర్ ఆదేశాల మేరకు అనుమతులు ఇచ్చినట్లు స్పష్టంగా ఉంది. ప్రస్తుత లెటర్‌లో ఉత్తర్వుల సంఖ్య, తేదీ కూడా పొందుపర్చలేదు. ఇదేకాకుండా మున్సిపల్ కమిషనర్ చేసిన సంతకం బ్లూ పెన్‌తో ఉంది. కమిషనర్ సంతకం ఫోర్జరీనా, నిజమైనదా అనేది అధికారులు తేల్చాల్సి ఉంది.

ఆకట్టుకుంటున్న చేనేత హస్తకళా ప్రదర్శన

నల్లగొండ పట్టణంలోని శివాజీనగర్ టీటీడీ కల్యాణ మండపంలో చేనేత హస్తకళా మేళా ప్రజలను ఆకట్టుకుంటోంది. పోచంపల్లి, నారాయణపేట్, పుప్పాడ, చీరాల, మంగళగిరి, కలంకారి, ఫ్యాన్సీ, ఖాదీ, కాటన్ ప్రింటెడ్, బెంగళూరు సిల్కు, కాటన్, గుజరాతీ డిజైన్ టాప్స్, డోర్ కర్టెన్స్, బెడ్ షీట్స్, రాజస్థానీ, జైపూర్, ఖాదీషర్ట్స్, సారంగపూర్ ఉడ్ ఐటమ్స్ ప్రదర్శనలో ఏర్పాటు చేశారు. ఈ నెల 17 వరకు హస్తకళా ప్రదర్శన నిర్వహిస్తామని నిర్వాహకుడు సింహాద్రి తెలిపారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నల్లగొండ


చెక్కతో చేసిన వస్తువులు


ప్రదర్శనలో ఏర్పాటు చేసిన చేనేత చీరలు


కొనుగోలు చేస్తున్న ప్రజలు


చెక్కతో తయారు చేసిన కుర్చీలు

ప్రజలు మరోసారి మోసపోయారు

చిట్యాల: శాసనసభకు ఎన్నికల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల ప్రలోభాలకు ప్రజలు ఆశపడి మరోసారి మోసపోయారని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. చిట్యాలలో మంగళవారం జరిగిన సీపీఎం నకిరేకల్ నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీపీఎం ప్రజల పక్షాన నిరంతర పోరాటాలు కొనసాగిస్తుందన్నారు. ఎన్నికల్లో సీపీఎంకి మద్దతుగా నిలిచిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు కామ్రేడ్ మల్లు వెంకటనరసింహారెడ్డి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కందాల ప్రమీల, జిల్లా కార్యదర్శి మేక అశోక్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, బొజ్జ చినవెంకులు, అవిశెట్టి శంకరయ్య, వెంకటేశ్వర్లు, పెంజర్ల సైదులు తదితరులు పాల్గొన్నారు.

సంఘమిత్ర కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లి.,
ప్రకాశం బజార్, నల్లగొండ. సెల్ : 9948534147

నూతన భవనంలోకి మార్పుట

సంఘమిత్ర కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లి.,ను ప్రకాశం బజార్ నల్లగొండలోని నూతన భవనం ఇం.నెం. 5-4-154 టు 159 లోకి తేది.08-12-2023న **శ్రీ రేపల్లి కిరణ్ కుమార్, డిస్ట్రిక్ట్ కో-ఆపరేటివ్ ఆఫీసర్, నల్లగొండ గారిచే ప్రారంభించనున్నాము.** కావున మా వాటాదారులు డిపాజిట్‌దారులు, ఖాతాదారులు హాజరు కాగలరని కోరుతున్నాము.

– చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్